www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్ 2025
5
కాకినాడ



యువత పోరును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఈ నెల 23న కాకినాడలో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి యువజన, విద్యార్థి విభాగం నాయకులు సమన్వయంతో పెద్దఎత్తున యువత పోరు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఇంటికో ఉద్యోగం, నెలకి నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామన్న హామీ కొండెక్కిందని విమర్శించారు. ప్రతి ఏడాది జనవరి ఒకటో తేదీన నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.



ముద్రగడ గిరిబాబు

ముంచుకొస్తున్న ఖరీఫ్

- నత్తనడకన గుర్తింపు కార్డుల ప్రక్రియ
- గగ్గోలు పెడుతున్న కౌలుదారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కౌలు రైతులకు ఈసారీ ఖరీఫ్ కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. గత ప్రభుత్వం మాదిరిగానే సిసిఆర్ కార్డుల జారీలో కూటమి ప్రభుత్వం సైతం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. కౌలు రైతుల సంఖ్యకు, గుర్తింపు కార్డులు జారీ చేసే లక్ష్యానికి పొంతన లేకుండా పోతుంది. 50 శాతం రైతులకు కూడా సిసిఆర్ కార్డులు ఇవ్వడం లేదు. అవి కూడా సకాలంలో జారీ చేయడం లేదు. దీంతో అనేక మంది రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి ఏర్పడుతోంది.

కౌలు రైతు పట్ల నిర్లక్ష్యం తగదు

తొలకరి మొదలవుతున్నప్పటికీ నేటికీ కౌలు గుర్తింపు కార్డుల జారీలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కార్డుల ప్రక్రియ నత్తనడకన నడుస్తున్నది. భూ యజమాని సంతకం లేకుండా కౌలు గుర్తింపు కార్డు ఇస్తామని ప్రభుత్వం ఓట్లు వేయించుకొని గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని ఈ ప్రభుత్వం సైతం అమలు చేస్తుంది. దీని ప్రకారం కౌలు గుర్తింపు కార్డు రావడం చాలా కష్టం. గుర్తింపు కార్డు రాకపోవడం వలన ప్రభుత్వ రాయితీలకు కౌలు రైతులు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపచేయాలని, కౌలు గుర్తింపు కార్డులు ప్రతి కౌలు రైతుకు ఇచ్చి లక్షన్నర వరకు పంట రుణాలు ఇవ్వాలి.

-వల్లు రాజబాబు, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి



జిల్లాలో పంటలను సాగు చేస్తున్న వారిలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. అంటే జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా. 2019లో నాటి వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు రైతు చట్టంతో వీరికి అన్యాయం జరుగుతోంది. సిసిఆర్ కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు ఇస్తామని చెబుతోంది. ఈ కార్డు ఇవ్వాలంటే భూ యజమాని సంతకం తప్పనిసరి చేసింది. అనేక చోట్ల యజమానులు ఇందుకు ఒప్పుకోవడం లేదు. దీంతో జిల్లాలో వేలాదిమంది కౌలు రైతులకు అన్యాయం జరుగుతోంది.

కార్డుల జారీలో నిర్లక్ష్యం

ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది. రైతులు పలుచోట్ల నారుమడులను సిద్ధం చేశారు. ఇంకా చాలా చోట్ల సిద్ధం చేసే పనిలో ఉన్నారు. కాలువల ద్వారా నారు మడులు కోసం అక్కడక్కడ నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం కాలువ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులంతా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. అయితే కౌలు రైతులకు సిసిఆర్ కార్డుల లింక్ పెట్టడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికే గుర్తింపు కార్డులను పూర్తిస్థాయిలో జారీ చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ ఏడాది 69 వేల మందికి జారీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు 8,297 మాత్రమే జారీ చేయగలిగారు. జిల్లాలో 1.50 లక్షల మంది ఈ రైతులు పంటలను సాగు చేస్తుండగా వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు మాత్రం ఏటా కొందరికే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. దీంతో అనేక మంది ప్రభుత్వ పథకాలను కోల్పోవాల్సి వస్తుంది. ఏ సాయం అందాలన్నా గుర్తింపు కార్డుకి లింక్ పెట్టడంతో వీరు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. జిల్లాలో ఉన్న మొత్తం వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను అధికారులు విస్మరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నింటా అన్యాయమే

సాధారణ రైతుల మాదిరిగా రుణాలు, రాయితీలు, వడ్డీ మాఫీ పథకాలు, పంటల నష్టపరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు వీరికి సక్రమంగా అందడం లేదు. అయినాకాడికి అప్పులు చేసి సాగు చేస్తున్నా పెట్టుబడి సొమ్ములు రాని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల వచ్చి పంటలకు నష్టం జరిగితే అనేకమంది అన్నదాతలు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. అప్పుల బాధ తాళలేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. ఇలా కౌలు రైతులు కష్టాల సుడిగుండంలో చిక్కుకుంటున్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



గ్రామాల్లో ఉపాధి కల్పన తీరుపై కార్మికుడితో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు శేషబాబ్జి

ఉపాధి చూపించేలా చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వం ఉపాధి చూపించేలా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. శనివారం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి ఎలా ఉందనే అంశంపై సిఐటియు ఆధ్వర్యంలో మాధవపురం, కాశివారిపాకలలో సర్వే నిర్వహించారు. సర్వే బృందం దృష్టికి స్థానిక ప్రజలు అనేక సమస్యలు తీసుకొచ్చారు. శ్రమకు తగ్గ వేతనం రావడం లేదని, ముఖ్యంగా ఉపాధి హామీ జాబు కార్డులు ఉన్నా పని దొరకడం లేదని, ఆరు నెలల వ్యవధిలో ఐదు వారాలే పని చెప్పడం జరుగుతుందన్నారు. ఇటుక బట్టీలో పనికి వెళదామంటే వేసవికాలంలోనే పని దొరుకుతుంది తప్ప మిగతా రోజుల్లో పని దొరకడం లేదన్నారు. ఈ సందర్భంగా శేషబాబ్జి మాట్లాడుతూ రాష్ట్రంలో కావలసింది యోగాలు కాదని, గ్రామీణ ప్రాంతాల్లో శ్రామికులకు ఉపాధి చూపించి పనులు కల్పించే చర్యలు ప్రభుత్వాలు చేపట్టాలన్నారు. శ్రమకు తగ్గ వేతనం కల్పించినట్లు అయితే వీరికి తినడానికి తిండి లభిస్తుందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.చిన్న, టి.రాజా, కె.విశ్వనాథం, డి.గోపాలకృష్ణ, బి అప్పారావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కళా రూపాలతో సామాజిక చైతన్యం

ప్రజాశక్తి -పెద్దాపురం

ప్రజా కళారూపాల ద్వారా సామాజిక చైతన్యం కోసం యాసలపు సూర్యారావు నిరంతరం కృషి చేశారని స్నేహ ఆర్ట్స్ కళాపరిషత్ అధ్యక్షులు గొందేశి రాజా అన్నారు. శనివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఏర్పాటుచేసిన కళారూపాల శిక్షణా శిబిరాన్ని ఆయన డబ్బు కొట్టి ప్రారంభించారు. ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న జానపద కళారూపాల పరిరక్షణ కోసం సూర్యారావు నిరంతరం కృషి చేశారని అన్నారు. జానపద కళారూపాలను, జానపద కళాకారులను ఆయన ప్రోత్సహించే వారన్నారు. ప్రతి ఏడాది సాంస్కృతిక ఉత్స వాల పేరుతో జానపద కళారూపాల ప్రద ర్శనలను ప్రోత్సహిం చేవారని గుర్తు చేశారు. ప్రజానాట్య మండలి నాయకులు దారపురెడ్డి కృష్ణ, దారపురెడ్డి సత్యనా రాయణ మాట్లాడుతూ కళలపట్ల, కళల ప్రయోజనం పట్ల కళాకారుల్లో నిత్యం చైతన్యం కల్పించేవారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తొలుత యాసలపు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సభలో సిపిఎం రూరల్ శాఖ కార్యదర్శి కేదారి నాగు, ప్రజానాట్యమండలి మండల అధ్యక్షులు మంతెన సత్తిబాబు, మాగాపు నాగు, సుబ్రహ్మణ్యం, బంగారు రాజు, అమృత, నమ్రత, పూజిత, వీరబాబు, గౌస్, వివేక్, అఖిల, నిఖిల, హాసిని, సూర్యకళ, లీల, దీపిక పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

మహిళా ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సంస్థల మహిళా ప్రజాప్రతినిధులలో నాయకత్వ లక్షణాలు, నిర్వహణ నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎపి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 'మార్పు ద్వారా విజేతలు' అనే శీర్షికతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ కెవిఎన్విప్రసాద్ చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూన్ 23 నుంచి బ్యాచ్‌ల వారీగా సామర్లకోట, బాపట్ల, శ్రీకాళహస్తిలోని విస్తరణ శిక్షణ కేంద్రాలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు 3 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో పాలకులుగా వారు తెలుసుకోవాల్సిన విధులు, బాధ్యతలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. రాజమండ్రి డివిజన్‌కు చెందిన 71 మంది మహిళా సర్పంచులకు జూన్ 23 నుంచి 25 వరకు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల 42 మంది మహిళా ఎంపిపిలకు జూన్ 25 నుంచి 28 వరకు సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు కావలసిన అన్ని వసతులు సమకూర్చామని, ప్రతిఒక్క మహిళా ప్రజాప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'యాసలపు' వర్ధంతి సభ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా నాయకు, ప్రజాకవి యాసలపు సూర్యారావు 13వ వర్ధంతి సభ ఆదివారం సాయంత్రం స్థానిక వరహాలయ్యపేట సెంటర్లో జరుగుతుందని సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్‌లోని యాసలపు సూర్యారావు బస్సు షెల్టర్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పిస్తారన్నారు. బహిరంగ సభకు సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.బేబీరాణి, నీలపాల సూరిబాబు పాల్గొంటారన్నారు. సభానంతరం ప్రజానాట్యమండలి కళాకారుల బృందం వివిధ కళారూపాలు ప్రదర్శిస్తుందన్నారు. ఈ సభలో సిపిఎం అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఏడాది పాలన ఎంతో సంతృప్తిని ఇచ్చింది

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. ఏడాదిపై పాలన సందర్భంగా శనివారం స్థానిక జి కన్వెన్షన్‌లో మెగా రక్త దాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్ర రావు, కూటమి నాయకులు కటకం శెట్టి బాబీ, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వివై.దాసు, పెంకే శ్రీనివాస్ బాబా, నూరుకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులు స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పంతం నానాజీ మాట్లాడుతూ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధిని ఐదు నిమిషాల్లో చెప్పలేనని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, నేటి కూటమి పాలన రాష్ట్రాన్ని గాడిలో పెడుతుందన్నారు. ఏడాది పాలనలో ఎంతో చేశామని, వచ్చే నాలుగేళ్ల రూరల్ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పెద్దలు, నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అధ్వానంగా టిఫిన్, భోజనం

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని బెండపూడిలో ఎఎస్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో అందించే మధ్యాహ్నం భోజనం అధ్వానంగా ఉంది. ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు ఉదయమే విద్యార్థులు చేరుకోవడంతో మధ్యాహ్నం భోజన పథకం అందించే నిర్వాహకులకే ఉదయం టిఫిన్ అందజేసే బాధ్యతను అప్పగించారు. ఉదయం 8 గంటలకు రావాల్సిన టిఫిన్ ఒక గంట పాటు ఆలస్యమైంది. పాఠశాలకు సదరు సంస్థ నిర్వాహకులు తీసుకువచ్చిన ఉప్మా నూక కలవకుండా ఉండలు ఉండలుగా ఉందని, తినేల కాదు తాగేలా ఉందని ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పి.లక్ష్మణరావు, నేషనల్ హ్యూమన్ రైట్స్ నాయకులు డి.వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. సిద్దు ఆక్షేపించారు. విద్యార్థులు ఎవరు టిఫిన్ తినలేదని పాడవేశారన్నారు. దీంతోపాటు రోజు ప్రభుత్వ విద్యా సంస్థలకు అందజేసే మధ్యాహ్నం భోజనం అధ్వానంగా ఉంటోందని, ఉడికీ ఉడకని అన్నంను సరఫరా చేస్తున్నారని, మెనూ అమలుచేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం పథకం పేరు మార్చింది తప్ప విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతలో ఎటువంటి మార్పు లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది తప్ప భోజనం అందజేయడంలో విఫలమైందన్నారు. గతంలో సదరు పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ షాన్‌మోహన్ మధ్యాహ్నం భోజనంపై అసహనాన్ని వ్యక్తం చేశారు. నాటి నుంచి నేటి వరకు భోజనం నాణ్యతలో ఎటువంటి మార్పు లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇంఇఒకు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు సిద్ధు



ఉడికీ, ఉడకని ఉప్మాను వడ్డించిన సిబ్బంది

ఎంఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సిద్దు ఎంఇఒ-2 నారాయణదాసుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిందన్నారు. నాణ్యతలేని భోజనం విద్యార్థులు తింటే అనారోగ్యాలకు గురవుతారని, తక్షణం ప్రభుత్వం, అధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పిఠాపురం

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సిద్దు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మండల అధ్యక్షురాలు జి.చిన్ని 'స్వతంత్రం - సోషలిజం - ప్రజాస్వామ్యం' ఆశయాలు ఉన్న జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఏర్పడి నేటికీ 55 సంవత్సరాలు పూర్తి అయ్యిందన్నారు. నాటి నుంచి ప్రభుత్వ విద్యా పరిరక్షణ, విద్యార్థుల సమస్యలపై నికరంగా పోరాడుతుందన్నారు. గత కార్యక్రమాలు సమీక్షించుకుని భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించేందుకు ఈ నెల 27 నుంచి నాలుగు రోజులు పాటు కేరళ రాష్ట్రంలో కోజికోడ్‌లో ఎస్ఎఫ్ఐ 18వ ఆల్ ఇండియా మహాసభలు జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లోవరాజు, వడ్డీ కాసులు, శశి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ చిన్ని

హెచ్ఒగా బాధ్యతలు స్వీకరించిన శ్రీవల్లి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల ఉద్యానవన అధికారిణిగా శ్రీవల్లి శనివారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన హెచ్ఒ లావణ్య కడియం బదిలీ కావడంతో ఆమె స్థానంలో శ్రీవల్లి ఏలేశ్వరం నుంచి బదిలీపై వచ్చారు. ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ చిన్ని

మండల సర్వసభ్య సమావేశం వెలవెల

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మండల పరిషత్‌లో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం వెలవెలబోయింది. ప్రజా గళాన్ని సమావేశంలో వినిపించాల్సిన ప్రజాప్రతినిధులు పూర్తిగా హాజరుకాలేదు. 16 పంచాయితీల పరిధిలో 23 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా, వారిలో సగం మంది కూడా హాజరుకాలేదు. సర్పంచ్‌లు సైతం అంతంతమాత్రంగానే హజరయ్యారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సైతం హాజరుకాకపోవడంతో కొంత మంది ప్రజాప్రతినిధులు సమావేశం ప్రారంభం కాగానే వెనుతిరిగారు. ఎంపిపి అత్తులూరి నాగేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల వారీగా నివేదికలపై మాట్లాడారు. ఈ సందర్భంగా రామవరం ఎంపిటిసి సభ్యులు దొడ్డ శ్రీను మాట్లాడుతూ విత్తనాలను సబ్సిడీపై అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు ఒమ్మి బిందుమాధవి, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, పంచాయితీ రాజ్ డిఇ ఉమాశంకర్, సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఇఒపిఆర్‌డి సూర్యభాస్కరరావు, ఎపిఎం ప్రశాంతి, పంచాయితీ రాజ్ ఎఇ నారాయణ, అర్ అండ్ బి ఎఇ సాయికిరణ్, అర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఆర్ ఎఇ నారాయణ

23న జిల్లావ్యాప్తంగా ఒలింపిక్ రన్

ప్రజాశక్తి - సామర్లకోట

1894 సంవత్సరంలో ఏథెన్స్‌లో ప్రారంభమైన ఒలింపిక్ క్రీడలను పురస్కరించుకుని ఈనెల 23న జిల్లావ్యాప్తంగా ఒలింపిక్ రన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు టి.వైకుంఠం, ప్రకాష్, కొండపల్లి శ్రీనివాస్, ఎన్ కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రు గోవిందరావు ఆధ్వర్యంలో కాకినాడ, అన్నవరం, పిఠాపురం, తుని, జగ్గంపేట, కరప, సామర్లకోట, యు.కొత్తపల్లి మండలాల్లో ఒలింపిక్ రన్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. అన్ని కేంద్రాల్లో ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సామర్లకోటలో స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి మఠం సెంటర్ వరకు ఒలింపిక్ రన్ ఉంటుందన్నారు.

అన్నదాన పథకానికి ప్రభుత్వ చీఫ్ విప్ విరాళం

ప్రజాశక్తి - శంఖవరం

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎంఎల్ఎ జిబిఎస్.ఆంజనేయులు అన్నవరం అన్నదాన పథకానికి లక్ష విరాళం అందించారు. శనివారం సాయంత్రం ఆయన అన్నవరం దేవుని దర్శనార్థం రత్నగిరి కొండపై విచ్చేశారు. వీరికి దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి చిత్రపటాన్ని ఆయనకు ఇఒ అందజేశారు. అనంతరం ఆయన నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని ఇఒకు అందజేశారు.




ఇఒకు విరాళం చెక్కును అందిస్తున్న చీఫ్‌విప్

మరుగుదొడ్లు, స్నానపు గదుల ఏర్పాటు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 24వ తేదీ రాత్రి నుంచి ప్రారంభం అయ్యే మరిడమ్మ జాతరకు వచ్చే యాత్రికుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులను శనివారం ప్రారంభించారు. స్థానిక తాళ్లూరు వారి సత్రం ఆధ్వర్యంలో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన టాయిలెట్స్, స్నానపు గదులను డాక్టర్ తాళ్లూరి శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్రం తరుపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా యాత్రికుల అవసరాలను గుర్తించి వీటిని నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు శ్యామ్, ప్రసాద్, రవితేజ, కాంబాబు, సత్తిరాజు, నాని పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



స్వచ్ఛ ఆంధ్రాకు కృషి చేద్దాం

ప్రజాశక్తి - సామర్లకోట, జగ్గంపేట

ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని బచ్చు ఫౌండేషన్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ కోరారు. శనివారం స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గంగాభవాని, బిఆర్ఎస్.శివకుమార్, టిఎస్.పద్మావతి, ఎన్.హరనాథ్, మహ్మద్ సైదున్నీసా బేగం, ఎం.శిరీష, ప్రశాంతి, బాలశైలజ, పి.సుధారాణి విద్యార్థులు పాల్గొన్నారు.అలాగే జగ్గంపేట సచివాలయం-1 వద్ద సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఎపిఎం ప్రశాంతి మొక్కలు నాటారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతాం అని స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిటి పార్థసారథి, ఇఒపిఆర్‌డి సూర్య భాస్కరరావు, అర్ఐ శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి జి.శివ, అంగన్‌వాడీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సామర్లకోటలో మొక్కను నాటుతున్న ఉపాధ్యాయులు



జగ్గంటపేలో మొక్కను నాటుతున్న సిడిపిఒ పూర్ణిమ



శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్నకార్మికులు

46వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవదిక సమ్మె శనివారం 46వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం సెంటర్లో ఇంజనీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 46 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో విధులునిర్వహిస్తున్న తమకు వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. తమ వేతనాల పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాసిన భద్రరావు, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, ఒ.సోనియా, సుంకర సత్తిరాజు, మలిపెద్ది భద్రరావు, బొమ్మన రవికుమార్, అయ్యప్ప స్వామి, పూల ప్రశాంత్, జి.సతీష్, మహాపాతిన పాపారావు, పి.సాయి, ఎస్‌కె.బషీర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వికలాంగుడు మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొని వికలాంగుడు బొడ్డపల్లి సత్యనారాయణ(45) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మామిడికుదురు శివారు గాలిదేవర పాలానికి చెందిన వికలాంగుడు ట్రైసైకిల్‌పై ఈదరాడవైపు వెళుతున్నాడు. అదే మార్గంలో వెళుతున్న ట్రాక్టర్ వెనుక నుంచి అతని ట్రైసైకిల్‌ను ఢీకొంది. ఈఘటనలో అతడు మృతి చెందాడు. మృతుడు సోదరుడు వీరాస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కొరకు రాజోలు ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.

పాము కాటుతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పంచాయతీ శాంతమూలలో ఒక విద్యార్థి పాముకాటుకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన వడ్డి రాంబాబు, చిన్న దంపతుల కుమార్తె వడ్డి సంజన (17) గొల్లపాలెం జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. శనివారం బహిర్భూమికి వెళ్లిన సంజనను పాముకాటు వేసింది. వెంటనే ఆమెను తాళ్లరేవు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె ఇలా మరణించడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో సామగ్రి దగ్ధం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలో ఎస్‌సి కాలనీకి చెందిన బులిపే ప్రసాద్‌కు చెందిన ఇంటిలో జరిగిన అగ్నిప్రమాదంలో సామాగ్రి దగ్ధం అయింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది. దీంతో ఇంటిలో పిల్లలు కొవ్వొత్తును వెలిగించి బయటకు వచ్చేశారు. ఈ నేపథ్యంలోనే ఇంటిలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. హుటాహుటీన పరిసర ప్రాంతంలోని యువకులు మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న నిత్యవసర సరుకులు, మంచం, టివి, ఫ్రిజ్, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధం అయింది. సుమారు 1.50 లక్షల వరకూ నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - మండపేట

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాల అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండపేట మండలం ఏడిదలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ సమావేశం ఎం.సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ధరలకు అనుగుణంగా ఏమాత్రం సరిపోదన్నారు. చాలీచాలని వేతనాలతో అంగన్‌వాడీలు ఏ విధంగా కుటుంబాలు పోషించు కుంటారని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం సాధికార సర్వేలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం వల్లే సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీలకు రకరకాల యాప్లు తీసుకొచ్చి తీవ్రమైన పని భారం పెంచిందని ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, అన్ని యాప్లు కలిపి ఒకే యాప్‌గా చేయాలని, మినీవర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని కోరుతూ ఈనెల 23న అమలాపురం కలెక్టర్ కార్యాలయం దగ్గర జరుగుతున్న ధర్నాలో పెద్ద ఎత్తున అంగన్‌వాడలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, లోకేశ్వరి, ఆదిలక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

జిల్లా ఉత్తమ ఉద్యోగ అవార్డులు అందుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ వాసంశెట్టి సత్యదేవ్ ప్రసాద్, రామచంద్రపురం టౌన్ విఆర్ఒ మద్దాల బాపూజీలకు తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, కార్యాలయం సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రామచంద్రపురం మండలానికి రెండు అవార్డులు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా మండలానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి ఎమ్.మాధురి, రీ సర్వే డిటి కె.హరి, మండల సర్వేయర్ పి.నాగేశ్వరావు, సీనియర్ అసిస్టెంట్ పి.రామారావు, మండల అధ్యక్షులు పి.సత్తిబాబు, గౌరవ అధ్యక్షులు ఎస్.సత్తిబాబు, ఉపాధ్యక్షులు సత్యవతి, కోశాధికారి కె.పరంజ్యోతి, నాయకులు పంపన విష్ణు మూర్తి, చీకట్ల వీరాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానాం పెదపేట ఎంపిపి పాఠశాలలో చదువుతున్న పదిమంది విద్యార్థులను దూరంలో ఉన్న మోడల్ స్కూల్‌కి వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహించారు. పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. 3,4,5 తరగతుల విద్యార్థులను మోడల్ స్కూల్ పేరుతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరామ్ నగర్ స్కూల్‌ను మోడల్ స్కూల్ చేశామని చెప్పి దాదాపు పది మంది విద్యార్థులను మోడల్ స్కూల్‌కి వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. విద్యార్థులందరూ ఆ మోడల్ స్కూల్‌కి నడిచి వెళ్లాలంటే గ్రామీణ ప్రాంతం కావడంతో నిరంతరం రోడ్లమీద పశువులు ,వీధి కుక్కలు తిష్ట వేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. చిన్నపిల్లలు రెండు కిలోమీటర్ల మేర ఎలా నడిచి వెళ్తారని తల్లిదండ్రులు ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులకు మొర పెట్టుకున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు .ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తమ పిల్లలకు భద్రత కావాలని తల్లిదండ్రులతో కనీసం చర్చించకుండా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూలుకు విద్యార్థులను ఎలా మారుస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వర్షం..హర్షం...



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నదికి వరద నీరు చేరడంతో పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతానికి నీరందించేందుకు అధికార యంత్రాంగం అడుగులు వేయడంతో మెట్ట ప్రాంతంలోనూ ఆశాజనకమైన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రైతులు పెట్టుబడి సాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏటా సాగు ప్రారంభం నాటికి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడంతో రైతులకు కొంత ఊరట లభించేది. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా రూ.20 వేలు నగదు సాయం అందజేస్తామన్న విషయం విదితమే. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. అయితే అర్హుల జాబితా అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లాలో అత్యధిక మంది కౌలు రైతులు సాగుదారులుగా ఉన్నారు. అయితే కౌలు రైతులను పూర్తిగా దూరం చేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ప్రతి ఏటా గోదావరి వరదల కారణంగా పంట నష్టం జరుగుతున్న విషయం విదితమే. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకోవటంతో పాటు రైతులకు అండగా నిలిచేందుకు చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంది.

భగ్గుమన్న అంగన్‌వాడీలు

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై అంగన్‌వాడీలు భగ్గుమన్నారు. తల్లికి వందనం పథకానికి అంగన్‌వాడీ కార్యకర్తలను దూరం చేయటమే ఈ దుస్థితికి కారణం. గర్భిణులు, శిశువులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్నారు. కనీస వేతనాలు, టిఎ, డిఎలు చెల్లించడంలో ప్రభుత్వాలు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. తాజాగా వేతనం సాకుగా చూపి తల్లికి వందనం పథకానికి అంగన్‌వాడీ కార్యకర్తలు అనర్హులయ్యారు. దీంతో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన ఆందోళనలు మిన్నంటాయి. గ్రామ పాలనకు సారధ్యం వహించే సర్పంచులు సైతం ఈ పథకానికి దూరం అయ్యారు. మరోవైపు విద్యుత్ వినియోగం, భూ రికార్డులలో నమోదైన తప్పులు వంటివి అర్హులను సైతం అనర్హులుగా మిగిల్చాయి. మరోవైపు కేంద్రీయ విద్యాలయం, కెజిబివి విద్యార్థులను సైతం ఈ పథకానికి ప్రభుత్వం దూరం చేసింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వారంలో సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేయక తప్పలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అర్హులందరికీ ఈ పథకం ఫలాలు అందజేయాల్సిన అవసరం ఉంది.

ప్రయాణికులకు పాట్లు

అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో జిల్లా నుంచి విశాఖకు బస్సులు కేటాయించడంతో వారం తంతా ప్రయాణికులకు పాట్లు తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి విశాఖలో నిర్వహించ తలపెట్టిన యోగా కార్యక్రమం సామాన్యులకు, ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు గురిచేసింది. రంగంపావారీగా గత కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో నిర్వహించిన యోగా కార్యక్రమాలకు ప్రజలను తరలించలేక చిరుద్యోగులు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు ఈ కార్యక్రమాలను మమ అనిపించినా విశాఖపట్నంలో భారీగా నిర్వహించిన యోగాకు ప్రజలు తరలింపు సైతం ఉద్యోగులకు లక్ష్యాలను విధించటం గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. అయితే ఎట్టకేలకు ఈ కార్యక్రమం పూర్తవటంతో అన్ని తరగతుల ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం మీద రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవం పలు విమర్శలకు దారి తీసింది.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లెలతో పాటు పట్టణాలలోనూ పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాలో జమ చేయకపోవటమే ఈ దుస్థితికి కారణం. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు తప్పటం లేదు. మరోవైపు ప్రజారోగ్య విభాగంలో కార్మికుల కొరత వెంటాడుతోంది. తాజాగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పల్లెలు, పట్టణాలు చిత్తడిగా మారుతున్నాయి. శివారు ప్రాంతాలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో విష జ్వరాలు విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధిపై సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

డ్వాక్రా మహిళల ఆర్థిక అభివృద్ధిపై అవగాహన సదస్సును స్థానిక సుందరయ్య భవనంలో జి.భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సదస్సులో లీడ్ బ్యాంక్ స్టాఫ్ సీనియర్ బ్యాంక్ మేనేజర్ అప్పారెడ్డి పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా గ్రూపుల పొదుపు సొమ్మును అంతర్గత అప్పులు నడుపుకోవడం కోసం పొదుపు సొమ్ముపై మీదే హక్కు అని, ఎక్కడైనా బ్యాంకు మేనేజర్లు అభ్యంతరం పెడితే లీడ్ బ్యాంకుకు తెలియచేయాలన్నారు. రుణాల ఇచ్చే సమయంలో బలవంతంగా ఇన్సూరెన్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు కట్టించకూడదని, అటువంటివి ఎక్కడైనా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే చాలాచోట్ల ప్రయివేట్ సంస్థలు అనేక రకాలుగా అప్పుల పేరు మీద మహిళలను మోసం చేస్తున్నాయని, వాటి బారిన పడవద్దని సూచించారు. డ్వాక్రా గ్రూపులను క్రమశిక్షణగా నడుపుకుంటూ లబ్ధి పొందాలని అన్నారు. డ్వాక్రా మహిళలు అత్యంత క్రమశిక్షణగా వాయిదాలు చెల్లిస్తున్నారని, ఇది చాలా మంచి పరిణామం అన్నారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, సామాజిక కార్యకర్త త్రిపన్న ఆదిలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు అవగాహన లేకపోవడం వల్ల చాలా మోసపోతున్నారన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవినీతి వెలుగులోకి వచ్చాయని గుర్తు చేశారు. మహిళలు ఎంతో కష్టపడి కూడగట్టిన సొమ్ము అభయ హస్తం పథకం కట్టారని, వాటికి ప్రభుత్వం సమాధానం చెప్పట్లేదని అన్నారు. దాని ద్వారా లబ్ది మహిళలకు అందడం లేదని, జీరో వడ్డీ లోన్లకు ప్రభుత్వం వడ్డీ వేయడం లేదని, ఇప్పటివరకు వేయాల్సిందంతా వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ఐక్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుంచే మణి, ఆర్.గౌరీ, బి.గంగాభవాని, ఐ.దుర్గ, కె. దుర్గాదేవి, సరస్వతి, కుమారి, ఎ.ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ అప్పారెడ్డి

సాగునీటి కాలువలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిధిలోని పటవల సాగునీటి కాలువలను, పంట బోదెలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని స్థానిక రైతులు డిమాండ్ చేశారు. శనివారం రైతులు కోసూరి రామారావు, కొక్కిరిమెట్ల సత్తిరాజు విలేకరులతో మాట్లాడారు. ప్రధాన పంట కాలువ నుంచి ఇబిసి కాలనీకి వెళ్లే సౌత్ ఛానల్లో పూర్తిస్థాయిలో పూడికలు తీయలేదని విమర్శంచారు. గ్రామంలోని ప్రజలకు తాగు, సాగునీటి అవసరాలకు ఈ కాలువ ఎంతో అవసరమని, ఆ కాలువను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేదని, ఉపాధి కూలీలు పని చేసిన కాలువలకు నీటి సంఘం ద్వారా యంత్రాలతో పనులు చేసినట్లు చూపుతున్నారని రైతులు ఆరోపించారు. సౌత్ ఛానల్‌కు నీరు రాకుండా డ్యామును మూసివేసారని తెలిపారు. పంట కాలవల్లో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు కక్ష పూర్వకంగా కోసూరి రామారావుపై లేనిపోని కేసులు పెట్టి నీటి సంఘం నాయకులు వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గాజుల విష్ణుచక్రం, గురజాల అప్పలరాజు, కోసూరి వెంకటరమణ, నాని తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన గ్రామీణ కార్మిక సర్వే

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వాకతిప్ప గ్రామంలో ఇంటింటా గ్రామీణ కార్మిక సర్వేని సిఐటియు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎంత మంది కార్మికులు ఉన్నారనే అంశంపై సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు కెవివి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, సిహెచ్.పద్మ, గుర్రాల అప్పారెడ్డి, జివిఎస్.రెడ్డి, వాసు, సుబ్రహ్మణ్యం, సిహెచ్.సాంబశివకుమార్, ఎం.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటా సర్వేలో వివరాలు నమోదు చేస్తున్న సిఐటియు నాయకులు

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని స్థానిక 3 లైట్ల జంక్షన్ దేవదాయ శాఖ కార్యాలయ రోడ్డులో జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, మున్సిపల్ కమీషనర్ భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యంతో మనిషి పరిపూర్ణ వికాసానికి దోహదం చేసే యోగ అనాదిగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఒ డి.రవీంద్రనాధరెడ్డి, డిఆర్ఒ జె.వెంకట్రావు, ఆయుష్ విభాగ అధికారి డాక్టర్ ఎంఎస్.ఆలీ, డిఎంహెచ్ఒ జె.నరశింహనాయక్, డ్వామా పీడీ పి.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐడియల్ డిగ్రీ కళాశాలలో యోగాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. **కాజులూరు** మండలంలోని పలు ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కాజులూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ జె.రాంబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎస్ఐ మోహన్‌కుమార్, పశు వైద్యాధికారి సుధీర్, కోటిపల్లి పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానికంగా జరిగిన యోగాంధ్రా కార్యక్రమంలో ఎంపిడిఒ ఎవిఎస్. చంద్రశేఖర్, సిడిపిఒ ఎం.పూర్ణిమ, డిటి పార్ధసారధి, ఎంఇఒ స్వామి, ఇఒపిఆర్‌డి సూర్య భాస్కరరావు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డి.చెన్నారావు అధ్వర్యంలో జరిగింది. అధ్యాపకులు, విద్యార్థులు యోగ చేశారు. **శంఖవరం** రత్నగిరి కొండపైన దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు ఆధ్వ ర్యంలో యోగాంధ్రా కార్యక్రమం జరిగింది. ఈ కార్య క్రమంలో సర్పంచ్ ఎస్.కుమారరాజా, కార్యదర్శి చక్రవర్తి పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** మండలం లోని గైగోలుపాడు జడ్‌పి ఉన్నత పాఠశాలలో టిడిపి నాయకులు పాలిక సతీష్ అధ్యక్షతన యోగాంధ్ర కార్యక్రమం మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలో పలుచోట్ల యోగాంధ్రా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ కె.స్వప్న పర్య వేక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన యోగాంధ్రా కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, సిఐ ఎ.కృష్ణభగవాన్ పాల్గొన్నారు. అలాగే రైల్వే స్టేషన్, విస్తరణ శిక్షణా కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్య క్రమాన్ని నిర్వహించారు. **గండేపల్లి** పాత పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్య క్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ చందర్రావు, పంచా యతీ కార్యదర్శి ఫణింద్రకుమార్ పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానికంగా జరిగిన యోగాంధ్రా కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.రమణి పాల్గొన్నారు. ఎంపిడిఒ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో సచివాలయాల పరిధిలో యోగ వేడుకలు జరిగాయి. **రౌతులపూడి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకలో ఎంపిడిఒ శివరామకృష్ణ పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన యోగాంధ్రా కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, ఎంపిడిఒ సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే కోరింగ ఫార్మసీ కళాశాలలో కళాశాల ఛైర్మన్ దున్న జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది యోగాసనాలు వేశారు.



బాల్యవివాహాలను నిరోధానికి కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐసిడిఎస్ పీడీ విజయకుమారి పిలుపునిచ్చారు. శనివారం చొల్లంగి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో ఆమె మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ వెంకటరావు, సిడిపిఒ మాధవి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు నిభావణి, రమణి, కనకరత్నం, స్థానిక నాయకులు కందిళ్ల గంగబాబు, మందాల గంగసూర్యానారాయణ, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా నరసింహం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల వ్యవసాయ అధికారిగా ఎస్.నరసింహం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎఒ రెడ్ల శ్రీరామ్ గండేపల్లికి బదిలీపై వెళ్ళడంతో ఆయన స్థానంలో తొండంగి ఎంఎఒగా పనిచేసిన నరసింహం ఇక్కడకు వచ్చారు. ఆయనకు వ్యవసాయ శాఖ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైందని, రైతులు వ్యవసాయ శాఖ సూచనలు మేరకు సాగుకు సిద్ధం కావాలన్నారు.

వసతి గృహానికి వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్యపేటలోని ఆనంద నిలయం బాలికల వసతి గృహానికి శనివారం వంటసామగ్రిని ప్రభుత్వం అందజేసిందని హాస్టల్ సంక్షేమ అధికారి జి.చిన్నారి తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వంట పాత్రల కిట్‌లో ఒక గ్యాస్ పొయ్యి, 20,10,15 కేజీల 3 వంట గిన్నెలు, 5 పోపుల డబ్బాలు, ఒక కళాయి ఉన్నాయన్నారు.

ఘనంగా మరిడమ్మ ఆయుష్ హోమం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఆయుష్ హోమం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ పొలమరశెట్టి సత్తిబాబు పర్యవేక్షణలో 12 భజన బృందాలు 24 గంటలపాటు ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారన్నారు. అనంతరం 8 మంది దాతలను, 50 మంది భజన కళాకారులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

పిసిసి చీఫ్ వైఎస్. షర్మిలా రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అమలాపురం విచ్చేయుచున్న సందర్భంగా శనివారం ముమ్మిడివరం గేట్ వింటేజ్ హోటల్ నందు కొండేటి చిట్టిబాబు అధ్యక్షతన జిల్లాలోని నియోజకవర్గ కోఆర్డినేటర్స్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 28వ తేదీన జరిగే షర్మిలా రెడ్డి నిర్వహించే సమావేశానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, ఎఐసిసి మెంబెర్ యార్లగడ్డ రవీంద్ర, కో ఆర్డినేటర్స్ అయితాబత్తుల సుభాషిణి, పాలేపు ధర్మారావు, కోట శ్రీనివాసరావు, రౌతు ఈశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్బు ప్రసాద్, నిమ్మకాయల ప్రసాద్, కుడిపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


యోగాసనాలు చేస్తున్న ప్రముఖులు, విద్యార్థులు

యానాంలో ఘనంగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి - యానాం


స్థానిక వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ కందవల్లి రామకృష్ణ, సిఐ అడలరసన్, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా రీజెన్సీ పబ్లిక్ స్కూల్, కాలేజ్ ఆవరణలో పిజిలు బి.శ్రీనివాస్, సోమేశ్ పర్యవేక్షణలో హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు, ప్రిన్సిపల్ పి.ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. స్థానిక ప్రభుత్వ బిటిలలో మై భారత్ యానాం పేరుతో విద్యార్థులు చేత యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర యువజన అధికారి తిర్రి గోపి, ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఎన్ఎస్ఎస్ పిఒ ఆనంద్ పాల్గొన్నారు.


సావిత్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

కామిశెట్టి సావిత్రికి నివాళి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ పాలన నుంచి యానాం విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధురాలు కామిశెట్టి సావిత్రి వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ అడలరసన్, కొల్లు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వాసవీ క్లబ్ అధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక కాకినాడ రోడ్డులో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు చంద్రమౌళి వెంకట శాస్త్రి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మానేపల్లి రామానుజ, కొత్త నాగపండు, కాకి విజయ్‌కుమార్, కాకి ఆనంద్‌కుమార్, వాసవి క్లబ్స్ సభ్యులు పాల్గొన్నారు.

శృంగార వల్లభునికి రూ.3.09 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3,09,209 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,94,280, అన్నదాన విరాళాల ద్వారా రూ.78,714, కేశఖండన ద్వారా రూ.8,080, తులాభారం ద్వారా రూ.550, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.27,585 వెరసి రూ.3,09,209 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.